ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు : జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్

కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్, మార్చి 18, ప్రభాతవార్త : మెదక్ జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షి స్తూ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలుగు నూతన సంవత్సర శ్రీపరాభ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల కలయికతో ఉగాది పండుగ రోజు తయారు చేసుకునే ఉగాది పచ్చడి ఒక గొప్ప సందేశం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పండుగ ను సంప్రదాయబద్ధంగా ఇంటిల్లిపాది బంధుమిత్రులతో ఆనందం గా జరుపుకోవాలని తోలినారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్థిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని అభిలషించారు. అలాగే అదనపు కలెక్టర్ నగేష్ కూడా జిల్లా ప్రజలకు నూతన తెలుగు సంవత్సర ఉగాది

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

గాలివానకు మొక్కజొన్న పంట నేలమట్టం

అక్కన్నపేట, మార్చి 18, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం మునిరెడ్డి తండాకు చెందిన రైతు జాటోత్ సంతోష్‌కు చెందిన మొక్కజొన్నపంట గాలివానకు నేలమట్టమైంది. మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, వాన కారణంగా చేతికి వచ్చిన పంట నేలకూలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మరో పది రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట పూర్తిగా దెబ్బ తినడంతో తీవ్ర నష్టాన్ని చవిచూశానని వాపోయాడు. పంట నష్టపోయిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

నేలకొరిగిన మక్కజొన్న

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

22న నర్మెటకు సిఎం రాక

మంత్రులను కలిసిన నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేట అర్బన్, మార్చి 18, ప్రభాతవార్త : సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట గ్రామంలో ఈనెల 22న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ హైదారాబాద్‌లో బుధవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కలిశారు. సిఎం రాక సందర్భంగా ఏర్పాట్లపై అసెంబ్లీ హాల్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలతో చర్చించారు. సిఎం రాక సందర్భంగా ఏర్పాటు చేసే సభను విజయవంతం చేయాలని మంత్రులు హరికృష్ణకు సూచించారు.

నర్మెటలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హైమావతి

సిఎం, మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

నంగునూర్, మార్చి 18, ప్రభాతవార్త : మండల పరిధిలోని నర్మెట గ్రామంలో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీని సిఎం రేవంత్‌రెడ్డి ఈనెల 22న ప్రారంభించనున్నడంతోపాటు 19న మంత్రుల చేతుల మీదుగా రైతు మేళా ప్రారంభోత్సవం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. బుధవారం అధికారులతో కలిసి నర్మెటలో పర్యటించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లతో పాటు రైతు మేళా కోసం సిద్ధం చేస్తున్న 150 స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 22 వరకు రైతు మేళా కొనసాగుతుందన్నారు. రైతు మేళాకు ప్రతి రోజు 3 వేల నుంచి 5 వేల మంది రైతులు హాజరవుతారని తెలిపారు. రైతులకు అవసరం అయ్యే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు స్వరూపరాణి, సువర్ణ, కొండల్‌రెడ్డి, జయదేవ్‌ఆర్య, శ్రీకాంత్, సమాచార పౌర సంబంధాలశాఖ అధికారులు రవికుమార్, భూపాల్, తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలను మెరుగుపర్చాలి సిపి

సీపీ రష్మీ పెరుమాళ్‌కు స్వామి వారి చిత్రం అందజేస్తున్న దృశ్యం

కొమురవెల్లి, మార్చి 18, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని మల్లికార్జున్‌స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీ రష్మీపెరుమాళ్ అన్నారు. శ్రీమల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా జాతరకు విచ్చేసిన భక్తులకు శాంతి భద్రతలు కల్పించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కృషి చేసినందుకు ఆలయ వర్గాలు బుధవారం సీపీ కార్యాలయంలో సీపీతో పాటు పోలీసు అధికారులకు, సిబ్బందిని కలిసి కృతజ్ఞతలు తెలిపి వేద ఆశీర్వచనం అందించి స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీ రష్మీపెరుమాళ్ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం జాతరకు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీకి పోలీసుశాఖ ద్వారా ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎసిపి సదానందం, దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు గంగం నరసింహారెడ్డి, సార్ల లింగం, మల్లేశం, ఎల్లయ్యయాదవ్, వంగరి వరలక్ష్మీనాగరాజు, ఎఈవో సుదర్శన్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు మనోహర్, సూర్యకుమార్, రేవణ, సిద్దేశ్వర్,వీరేశలింగం, చేర్యాల సీఐ రమేష్, కొమురవెల్లి ఎస్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు

జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్

మెదక్, మార్చి 18, ప్రభాతవార్త : మెదక్ జిల్లా కేంద్రంలోని వివిధ హోటల్స్, టీపాయింట్లలో వాణిజ్య వినియోగం కోసం అక్రమంగా ఉపయోగిస్తున్న 52 గృహ సిలిండర్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దార్లు సభ్యులుగా మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు నిర్వహించి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల కోసం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దార్లు సభ్యులుగా మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం, 1955 లోని సెక్షన్ 6తి కింద కేసులు నమోదు చేయబడినవి మరియు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్ తెలిపారు. జిల్లా పరిపాలన గృహ ఎల్‌పిజి సిలిండర్ల దుర్వినియోగం, మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలను గమనించినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న 52 సిలిండర్లు

శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

కౌడిపల్లి, మార్చి 18, ప్రభాతవార్త: కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రీయ సూచనలు, సాంకేతికపరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. బుధవారం కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞానకేంద్రంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, జిల్లా వ్యవసాయాధికారి దేవకుమార్ ఆధ్వర్యంలో కెవికెలో ఏర్పాటుచేసిన అధిక సాంద్రత సాగుపై కిసాన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. కిసాన్ మేళా సంద ర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. ఈ మేళాలో రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్దతులు, పంటల నిర్వహణ విధానాలు, యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా సందర్శించి రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణా ళికలో భాగంగా కిసాన్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక పద్దతులను అనుసరించినట్లేతే పంటల దిగుబడిని పెంచు కోవచ్చని ఆమె చెప్పారు. పంట మార్పిడి పద్దతులను ఆమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడు కోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక పద్దతులను అవలంబిస్తూ ఆధునిక వ్యవసాయాన్ని చేపట్టాలని ఆమె రైతులకు సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ వ్యవ సాయంతోపాటు వాణిజ్య పంటలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ మేళాకు వెయ్యి మంది రైతులు రావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ రైతు లేనిదే మనుడగలేదన్నారు. రైతులు నష్టాలకు ఓర్చి భూమిని నమ్ముకొని ఆశలతో బతుకుతారని, వారిని ఎంతైనా ప్రోత్సహించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని ఆమె అన్నారు. ఆయిల్‌ఫామ్ సమస్యలను అధికారులు రైతులకు వివరించాలని ఆమె కోరారు.

ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో రామ కృష్ణా, సినియర్ శాస్త్రవేత్త డాక్టర్ నల్కర్, ఉద్యాన వన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి వెంకటయ్య, సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్, మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు, కెవికెకు చుట్ట ప్రక్కల మండలాల నుండి విచ్చేసిన రైతులు తదితరలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ పాండు

ఎస్సీ పథకాల అమలులో బ్యాంకర్లు సహకరించాలి : అడిషనల్ కలెక్టర్ పాండు

సంగారెడ్డి మున్సిపాలిటీ , మార్చి 18, ప్రభాతవార్త : ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన యూనిట్లకు బ్యాంకులు వేగంగా రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ పాండు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళిక 2025-26 కింద సంగారెడ్డి జిల్లాకు మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లకు రుణాల మంజూరుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ పాండు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఎల్‌డిఎం) నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం క్రిష్ణ తేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన వివిధ యూనిట్లకు బ్యాంకులు సమయానికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీతో ఈ పథకాలను అమలు చేస్తున్నందున బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. లబ్ధిదారులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారని, అనంతరం స్క్రీనింగ్ కమ్ సెలక్షన్ కమిటీ ద్వారా అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకులు త్వరితగతిన కాన్సెంట్ ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణ సదుపాయాలతో లబ్ధిదారులు స్వయం ఉపాధి ఏర్పరుచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బ్యాంకులు సహకరించాలని కోరారు.

అవయవ దానంతో పలువురి జీవితాల్లో వెలుగు

చిన్నశంకరంపేట, మార్చి 18,ప్రభాతవార్త: అన్ని దానాల్లో కెల్లా అవయవ దానం అత్యున్నతమైనది. అవయవదానం చేసి మృతిచెందినా జీవించాడు మిర్జాపల్లి గ్రామానికి చెందిన కుంట సందిప్‌కుమార్. గ్రామానికి చెందిన యువకుడు(28), ఈ నెల 12వ తేదీన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడగా తలకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నార్సిగింలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి భాగ్యనగరంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందిప్ బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు తెలిపారు. సందీప్ అవయవాలు దానం చేయాలని, అవయ దానం ప్రాముఖ్యత కుటుంబసభ్యులకు తెలిపారు. అవయవదానానికి అంగీకరించిన తల్లి కళావతికి వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. తండ్రి బాలరాజు ఆనారోగ్యంతో గతంలోనే మరణించగా, ఇప్పుడు కుమారుడు మృతి చెందడంపై తల్లి రోదించిన తీరు వర్ణాణాతీతం. తల్లి త్యాగాన్ని గ్రామస్థులు కొనియాడారు.

విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక సాహిత్య సమ్మేళనం

ములుగు, మార్చి 18 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలం, ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ అంతర్ కళాశాల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య సమ్మేళనం మూడు రోజుల పాటు ఉత్సాహభరితంగా కొనసాగగా బుధవారం ఘనంగా ముగిశాయి. ఈనెల 16న ప్రారంభమైన క్రీడా పోటీలు, జట్టు ఆటలు, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనగా, రాజేంద్రనగర్ హార్టికల్చర్ కళాశాల జట్టు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోగా, సాంస్కృతిక మరియు సాహిత్య పోటీలలో మోజర్ల హార్టికల్చర్ కళాశాల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ డి.రాజిరెడ్డి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య కార్యకలాపాలు సమాన ప్రాధాన్యత కలిగినవని, ఇవి కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జట్టు భావన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ హార్టికల్చర్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జె.చీనా నాయక్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, అసోసియేట్ డీన్స్ డాక్టర్ ప్రీతమ్‌గౌడ్, డాక్టర్ వీణాజోషి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆఫీసర్ ఇన్‌చార్జ్, పిజిఐహెచ్ఎస్ డాక్టర్ వి.సుచిత్ర పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది పంచాంగ ఆవిష్కరణ

సిద్దిపేట అర్బన్, మార్చి 18, ప్రభాతవార్త :

సిద్దిపేట వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్ వాసవి దేవాలయం ఆవరణలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉగాది పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కొత్త సంవత్సర ఫలితాలను వివరించి సమాజం అభివృద్ధి, శాంతి సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఉగాది పండుగ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. పంచాంగం జీవన విధానానికి మార్గదర్శకంగా పని చేస్తుందన్నారు. తెలుగు కొత్త సంవత్సరంలో సమాజ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలన్నారు. కొత్త సంవత్సరంలో మంచి పనులకు శ్రీకారం చుట్టాలని అకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రతినిధులు మాంకాల నవీన్, మాంకాల శ్రీనివాస్, కూర శ్రీనివాస్, ఉమరాణి, మాంకాల నాగరాణి, వనజ శివకుమార్, రవి, కృష్ణవేణి, మంజుల, జైన సత్యం, నాగముల కిషన్, ఐత బాలరాజేశం, పొశెట్టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బైరాన్‌పల్లికి వీర బైరాన్‌పల్లిగా నామకరణం చేయాలి

ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ధూళిమిట్ట, మార్చ్ 18,ప్రభాతవార్త : తెలంగాణ సాయుధ పోరాటంలో సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామ ప్రజలు ప్రదర్శించిన అపార ధైర్యసాహసాలను గౌరవిస్తూ, వారి బలిదానాలను స్మరించేందుకు ఆ గ్రామానికి వీర బైరాన్‌పల్లిగా నామకరణం చేయాలని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పర్యాటక, సంస్కృతి, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు అసెంబ్లీ ఆయన ఛాంబర్లో బుధవారం వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా బైరాన్‌పల్లి, కూటిగల్, లింగాపూర్ గ్రామాలను చారిత్రక ప్రాముఖ్యత గల ప్రాంతాలుగా అధికారికంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతాలలో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి, బైరన్‌పల్లిలోని ప్రసిద్ధ బురుజు సహా ఇతర చారిత్రక కట్టడాలను పరిరక్షించాలని సూచించారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, ఈ ప్రాంతంలోని అమరవీరుల కుటుంబాలకు మరియు ప్రాణాలతో బయట పడిన వారికి తగిన ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తే, చరిత్రకు గుర్తింపుతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

నేత్రపర్వంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి విమాన రథోత్సవం

-అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం

వర్గల్, మార్చి 18 (ప్రభాతవార్త): ప్రసిద్ధ నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి విమాన రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్త, కార్యనిర్వహణాధికారి బెల్లంకొండ రంగాచారి ఆధ్వర్యంలో మంగళవారం అర్థరాత్రి దాటాక వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తజనుల హర్షధ్వానాలమధ్య రథ ప్రతిష్ఠ నిర్వహించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన విమాన రథంపై సతీసమేతులైన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని అధిష్టింపజేశారు. బుధవారం తెల్లవారుజాము వరకు భక్తుల దర్శనార్థం ఉంచగా, అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు హరిద్రా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొని పునీతులయ్యారు. ఈ క్రమంలో నాచగిరి, శ్వేతగిరి కొండలు స్వామివారి నామస్మరణతో మార్మోగగా, భక్తుల భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మహిళల కోలాటలు, పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు భక్తులను కనువిందు చేశారు. ఈ క్రమంలో నిచగిరి పురవీధుల్లో విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా స్వామివారిని ఊరేగించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సిబ్బంది తీర్థప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు విజయ మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు నిమ్మ రంగారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి బాలుయాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేష్, స్థానిక సర్పంచ్ సారిక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాచగిరిలో శ్రీ లక్ష్మీనృసింహ్మాస్వామి విమాన రథోత్సవ దృశ్యం

చెట్టుకు ఉరేసుకుని రైతు ఆత్మహత్య

దుబ్బాక, మార్చి 18, ప్రభాతవార్త : అప్పులు తెచ్చి వేసిన వరి పంట నీరందక కళ్లముందే ఎండిపోతుంటే ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఊరి కొయ్యలే ఉచ్చుగా బిగించుకొని రైతు తనువు చాలించిన సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లిలో బుధవారం జరిగింది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు చిన్నారెడ్డి మోహన్‌రెడ్డి రెండున్నర ఎకరాల భూమి ఉండగా వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారు. ఉన్న భూమిలో యాసంగి పంటకు గానూ వరి సాగు చేశారు. వరి పంట చేతికి వస్తున్న క్రమంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో అప్పులు తెచ్చి బోరు వేసిన చుక్క నీరు రాకపోవడంతో ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. కండ్ల ముందే వేసిన వరి పంట ఎండిపోయి కనిపిస్తుంటే చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేదని దిగాలు చెందిన రైతు వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్నారి కూతుర్లు ఉన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ

9 మంది విద్యార్థులకు స్వల్పగాయాలు



లారీ ఢీకొనడంతో స్కూల్ బస్సు వెనుక ధ్వంసమైన దృశ్యం

చిన్నకోడూరు, మార్చి 18, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఇబ్రహీం నగర్ బస్సు స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై రావుస్ స్కూల్ బస్సును లారీ ఢీకొట్టడంతో 9 మంది విద్యార్థులకు స్వల్పగాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఇబ్రహీంనగర్‌లో బస్సు స్టేజీవద్ద ఆగిఉన్న స్కూల్ బస్సును వెనక నుంచి సిమెంటు లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. చిన్నకోడూరు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో గాయపడినన విద్యార్థులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటింటి సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 18, ప్రభాతవార్త

జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్, ఇంటింటి సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓలకు తాకీదులు తప్పవని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి నిజమైన ఓటర్లను గుర్తిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్వోలు, సూపర్ వైజర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాలకు చెందిన ఈఆర్ఓలు, ఏఈ ఆర్ఓలు, బిఎల్వోలు, సూపర్‌వైజర్లతో వీడియో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి బిఎల్ఓ తన పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం కోసం నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్ఓలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. బిఎల్ఓలు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని తెలిపారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియలో నిర్లక్ష్యం వహించే బిఎల్వోలకు తాకీదులు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బిఎల్వో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బిఎల్వోలు లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే బిఎల్వోలను నియమించాలని ఈఆర్ఓలను ఆదేశించారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 13 కేటగిరీలలో బిఎల్వోలను నియమించుకోవచ్చని అన్నారు. బిఎల్వోల వివరాలను ఈసీఐ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈఆర్ఓలు ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీవో రాజేందర్, ఎన్నికల విభాగం సెక్షన్ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రావిణ్య

అంగరంగవైభవంగా మల్లికార్జునుడి రథోత్సవం

మల్లన్న గుట్ట వద్ద ఘనంగా రథోత్సవం

వెల్దుర్తి, మార్చి 18, ప్రభాతవార్త:
మండలంలోని బస్వాపూర్ క్షేత్రం వద్ద వెలిసిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి 49వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు గత మూడు రోజుల నుండి మల్లన్నగుట్ట ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 6 గంటలకు రథోత్సవం కార్యక్రమంతోపాటు వివిధకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు విశేషంగా పాల్గొని రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించి వారిమొక్కులను తీర్చుకున్నారు. పరిసరప్రాంత ప్రజలతోపాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ కార్యక్రమంలో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు.

మండలంలోని అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు సిద్ధం

ఉత్సవాలు జరుగనున్న గజగట్లపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

చిన్నశంకరంపేట, మార్చి 18, ప్రభాతవార్త:
శ్రీపరాభవనామ తెలుగుసంవత్సరం ఉగాది పర్వదినాన్ని బుధవారం మండలవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో ఘనంగా జరుపుకోనున్నారు. ఆలయాల్లో పంచాంగశ్రవణం వైభవంగా నిర్వహించనున్నారు. మండలంలో ఉగాది పండుగ ఏర్పాట్ల కోసం సర్వం సిద్ధంచేశారు. పలు ఆలయాలు పండుగ వేడుకల కోసం అందంగా ముస్తాబయ్యాయి. ఉదయం, సాయంత్రం ఆలయాల్లో పంచాంగశ్రవణం వేదపండితులు వినిపించనున్నారు. ఇంటికి మామిడి తోరణాలను అలంకరించి ఉదయం పూట ప్రజలు ఆలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ తమ మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం ఉగాది పచ్చడి చేసి నూతన తెలుగుసంవతర్సానికి నాంది పలుకుతారు.

గజగట్లపల్లిలో...
చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామంలో నాలుగు రోజుల పాటు ఉగాది ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. పుష్కరకాలంగా ఉగాది సంబరాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. ఏటా ఈ ఉత్సవాలు ఆరంభం నుంచి ముగిసేవరకు గ్రామంలో మద్యం, మాంసం నిషేధం అమలవుతుంది. గ్రామ శివారులో దక్షిణ ప్రాంతంలో అటవీ ప్రాంతంలో సొరంగ మార్గంలో వెలసిన వేంకటేశ్వరస్వామి అంశతో వెలసిన ఆలయం వద్ద కూడా ఉత్సవాలు జరుపుకుంటారు. నాలుగు రోజల పాటు అలంకరించిన ఎడ్లబండ్లు ఊరేగింపు, బోనాలు, హోమాలు, విశేష పూజలతో ఆధ్యాత్మిక సందడి తొణికిసలాడుతుంది. మండలంలోని గ్రామాల నుండి స్వామివారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకొని, మొక్కులు చెల్లించుకుంటారు.

సామాన్యులకు గ్యాస్ కష్టాలు..

చిన్నశంకరంపేటలో గ్యాస్ కోసం బారులు తీరిన ప్రజలు

చిన్నశంకరంపేట, మార్చి 18, ప్రభాతవార్త:
గ్యాస్ కష్టాలు సామాన్యులు రోడ్లపై గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొన్నిరోజులుగా చిన్నశంకరంపేట పట్టణంలో గ్యాస్‌కొరతతో గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో గ్యాస్ అవసరాలు పెరగడంతో పట్టణంలో గ్యాస్‌కొరత స్పష్టంగా కనిపిస్తుంది. చిన్నశంకరంపేట పట్టణంలో గ్యాస్ ఆటో రాగానే ఆటో వద్దకు వినియోగదారులు పోటెత్తారు. గ్యాస్ బుక్ చేసుకున్నవారికి మాత్రమే సిలెండర్లను నిర్వాహకులకు అందించారు. గ్రామీణప్రాంతం వారికి కేంద్రప్రభుత్వం 45రోజులకు ఒక సిలిండర్‌ను ఇవ్వాలని పెట్టిన నిబంధనతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పరిశ్రమలకు కూడా ఎల్పీజీతో అవసరాలు అధికంగా ఉండటంతో వారికి కూడా ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు కొరత లేదని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో నిర్వహణాలోపంతో సామాన్యులకు గ్యాస్ కష్టాలు తప్పడంలేదు.

బ్రాహ్మణుల మనోభావాలను కించపర్చవద్దు

పెద్దశంకరంపేటలో నిరసన తెలుపుతున్న బ్రాహ్మణసంఘం సభ్యులు

పెద్దశంకరంపేట, మార్చి 18, ప్రభాతవార్త:
బ్రాహ్మణుల మనోభావాలను కించపర్చేవిధంగా వ్యవహరించవద్దని మండల బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు రాయలగారి కృష్ణశర్మ అన్నారు. బుధవారం స్థానిక శివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ బ్రాహ్మణులపై చేసిన వాఖ్యలు అర్థరహితమన్నారు. ఈ వ్యాఖ్యలను బ్రాహ్మణసంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎమ్మెల్యే సామెల్ బ్రాహ్మణులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అర్చకసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖరశర్మ, సభ్యులు నాగరాజశర్మ, రాజేశ్వరరావు, సంతోష్‌శర్మ, గుడి రామాచారి, రంగన్న, సీతారాం, సంగమేశ్వరశర్మ, రాము, గిరిధరశర్మ, ప్రభాకర్‌రావు తదితరులున్నారు.

గీతంలో ముగిసిన పౌరరక్షణ వాలంటీర్ల శిక్షణ

పటాన్‌చెరు, మార్చి 18, ప్రభాతవార్త:
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన పౌరరక్షణ వాలంటీర్ల శిక్షణ బుధవారం విజయవంతంగా ముగిసింది. కార్యక్రమాన్ని వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వశాఖల సహకారంతో, తెలంగాణ అగ్నిమాపక విపత్తు స్పందన అత్యవసర పౌరరక్షణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన గీతం విద్యార్థి స్వచ్ఛందసేవకులకు, జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా విలువైన గుర్తింపుకార్డు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమాన్ని మార్చి 12న గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.నాగేశ్వరరావు, పటాన్‌చెరు అగ్నిమాపక శాఖాధికారి కె.వి.నాగేంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది సమక్షంలో లాంఛనంగా ప్రారంభించిన విషయం విదితమే.

సదాశివపేటలో ఘనంగా ఇఫ్తార్ విందు

-పాల్గొన్న టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న టజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి

సదాశివపేట, మార్చి 18, ప్రభాతవార్త:
సదాశివపేట పట్టణం, మంగళవారం పట్టణంలోని పిట్టలకేరి ప్రాంతంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టిజిఐఐసిసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రత, నియమనిష్ఠలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుకచిరు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, కౌన్సిలర్లు వాజిద్, సజ్జి, ఖలీమ్ ఖురేషి, దుబాయ్ వాజిద్, ఇఫ్తార్ విందు నిర్వాహకులు వసీం, మైనార్టీ అధ్యక్షుడు చోటు బాయ్, ఆత్మకమిటీ డైరెక్టర్ సాబేర్ సర్పంచులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తే సహించేది లేదు

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం

నర్సాపూర్, మార్చి 18, ప్రభాతవార్త:
తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని చలో హైదరాబాద్ వెళ్లిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను నర్సాపూర్ ప్రాజెక్టు అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తూ మెమోల పేరుతో మానసికంగా వేధించడం సహించేది లేదని ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని సిఐటియు మెదక్ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం అన్నారు. బుధవారం నర్సాపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ధర్నాలో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఈ నెల 16న వెళ్లిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కి ధర్నాకు అనుమతి లేదనే పేరుతో ఉదేశ్యపూర్వకంగా మెమోలు తీసుకొని వివరణ రాయాలని వత్తిడిచేయడం అధికారులకు తగదని ప్రజాస్వామ్యంలో పోరాటాలుచేస్తూ హక్కులు సాధించుకునే హక్కు ఉందన్నారు. వెంటనే మెమోలు ఇచ్చే పద్ధతిని మానుకోవాలని, లేనిపక్షంలో అంగన్వాడీ యూనియన్ సిఐటియుగా నిర్ణయాలుచేసి పోరాటాలకు పిలుపు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కదారి నాగరాజు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పెద్దశంకరంపేట, మార్చి 18, ప్రభాతవార్త:
ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని అల్లాదుర్గం సిఐ రేణుకారెడ్డి అన్నారు, బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో మైనార్టీలకు రంజాన్ పండుగ సందర్భంగా పలుసూచనలు చేశారు. ఉగాది, శ్రీరామనవమి, రంజాన్ పండుగల సందర్భంగా కులమతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలను జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సిఐ రేణుకరెడ్డి సూచించారు. పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, ఎఎస్ఐ చంద్రమోహన్ తదితరులున్నారు.

పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేసిన డిఈఓ

పాపన్నపేట, మార్చి 18, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన పాపన్నపేట పదో తరగతి పరీక్షాకేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయ ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం పరీక్ష రికార్డులను రిజిస్టర్‌లను పరిశీలించారు. పదోతరగతి పరీక్షలను ఎంతమంది విద్యార్థులు రాస్తున్నారు, వచ్చిన పరీక్ష పేపర్లు ఎన్ని, ఎన్ని పేపర్లు వాడారు తదితర విషయాలను చీఫ్ సూపరింటెండెంట్ నజీర్, డిపార్ట్మెంట్ అధికారి పద్మలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆమె వెల్లడించారు. డిఇఒ వెంట జిల్లా పరీక్షల విభాగ అధికారి కరుణాకర్, చీఫ్ సూపరింటెండెంట్ నజీరోద్దీన్, డిపార్ట్మెంటల్ అధికారిణి పద్మ ఉన్నారు.

సదాశివపేట 6వ వార్డులో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్

సదాశివపేట, మార్చి 18, ప్రభాతవార్త:
సదాశివపేట పట్టణంలోని 6వవార్డు కృష్ణానగర్ కాలనీలో బుధవారం వార్డు కౌన్సిలర్ నాగుల మణెమ్మ బిఆర్ఎస్ నాయకులు నాగుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేయడం జరిగింది. ఇఫ్తార్‌లో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్ పాల్గొని ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలకు పండ్లు పానీయాలు అందించారు. ప్రజలంతా కులమతాలకతీతంగా పండుగ వాతావరణంలో గడపడం రంజాన్ మాసంతోనే సాధ్యమవుతుందన్నారు. పెద్దల పట్ల గౌరవం, తల్లిదండ్రులు, గురువులపట్ల భక్తి, సమాజంపై శ్రద్ధ అల్లాహ్ చూపిన మార్గాలని చింత సాయినాథ్ పేర్కొన్నారు. ఆరవ వార్డ్ కౌన్సిలర్ నాగుల మణెమ్మ, బిఆర్ఎస్ నాయకులు నాగుల విజయకుమార్ అనునిత్యం ప్రజల్లో ఉంటూ వారి బాగోగులను చూస్తూ వార్డు అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని చింత సాయినాథ్ తెలిపారు.

నూతన బోరు మోటర్ ప్రారంభం..



బోరుమోటారును ప్రారంభిస్తున్న దృశ్యం

నార్సింగి, మార్చి 18, ప్రభాతవార్త:
నార్సింగి మండలంలోని జాప్తి శివనూర్ గ్రామంలో 6వ,7వ వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు బావికి సర్పంచి నర్సింలు కొబ్బరికాయకొట్టి పూజచేసి ప్రారంభించారు. సర్పంచి మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్య ఉందని, రానున్నది వేసవికాలం కావున ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈరోజు నూతన మోటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తాము కోరగానే సమస్యను పరిష్కరించిన పాలకవర్గ సభ్యులకు కాలనీవాసులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి రాములు, వార్డుసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి: ఎవో

చిన్నశంకరంపేట, మార్చి 18, ప్రభాతవార్త:
ప్రభుత్వం రైతులకు పెట్టుబడి కింద ఆర్థిక సాయం అందించే రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చిన్నశంకరంపేట మండల వ్యవసాయ అధికారి (ఎవో) లక్ష్మీప్రవీణ్ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఇప్పటివరకు రైతు భరోసా పొందని, బ్యాంకు వివరాలు నమోదు చేయని వారు రైతువేదికల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రంతోపాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా పుస్తకం నకలు ప్రతులు, మొబైల్ నంబర్ వివరాలను సమర్పించాలన్నారు. దరఖాస్తుల సమర్పణకు మార్చి 25 వరకు గడువు ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వరంగ ఉద్యోగుల ఖాళీలపై అసెంబ్లీలో ప్రశ్నించిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్, మార్చి 18 ప్రభాతవార్త:
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ప్రభుత్వరంగ ఉద్యోగుల ఖాళీల సమస్యలపై అసెంబ్లీలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి గొంతెత్తారు. వివిధరంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీచేసి నారాయణఖేడ్ నియోజకవర్గంలో అభివృద్ధికి సహకరించాలని సభాదృష్టికి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. అధికారులు పూర్తిస్థాయిలో విధి నిర్వహణలో ఉంటే ఆయా శాఖలోని పనులు సక్రమంగా జరుగుతాయని అందుకోసం ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీ చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసి నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించవలసిందిగా ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు.

కౌడిపల్లి తైబజార్ రూ.7.10 లక్షలు

కౌడిపల్లి వేలంపాటలో తైబజార్ దక్కించుకున్న కుమార్

కౌడిపల్లి, మార్చి 18, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన కౌడిపల్లి సంతలో లో కొనసాగే కూరగాయల మార్కెట్, మాంసం విక్రయాలకు సంబంధించిన తైబజార్ వేలంపాట నిర్వహించగా కౌడిపల్లి గ్రామానికి చెందిన గొల్ల కుమార్ రూ.7.10 లక్షల అధిక వేలంపాట పాడి కైవసం చేసుకున్నారు. బుధవారం కౌడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచులఫోరం జిల్లా ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచి చంద్రం కృష్ణగౌడ్, ఎంపిఓ రామారావు ఆధ్వర్యంలో తైబజార్ వేలంపాట నిర్వహించగా 8మంది సభ్యులు పాల్గొన్నారు. తైబజార్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామ అభివృద్ధికి వాడుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు గ్రామ ఉపసర్పంచి శ్వేతామల్లికార్జునగౌడ్, గ్రామ వార్డుసభ్యులు మక్బూల్, దేవేందర్‌కుమార్, గౌడచర్ల ప్రశాంత్, మురళినాయక్, అజ్మీర్ రమేష్‌నాయక్, లక్ష్మీశరత్‌కుమార్, సందీప్‌కుమార్, ఆర్యవైశ్యసంఘం జిల్లా కార్యవర్గసభ్యులు శ్రీనివాస్‌గుప్తా, నాన్న వెంకటేశం గుప్తా, కురుమసంఘం మండల అధ్యక్షులు లక్ష్మణ్‌యాదవ్, రాగుల భూమయ్యపటేల్, రమేష్‌గౌడ్, బచ్చలి నాగరాజ్, చంద్రం కిషోర్‌గౌడ్, పుండరీకమ్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, గ్రామకార్యదర్శి వెంకటేశం, కారోబార్ ఎల్లంలతోపాటు వేలంపాటదారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధి మా లక్ష్యం

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సిసి రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే దృశ్యం

పటాన్‌చెరు, మార్చి 18, ప్రభాతవార్త:
నియోజకవర్గం పరిధిలోని గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామంలో 10లక్షల రూపాయల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతోపాటు పరిశ్రమల భాగస్వామ్యంతో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని మంచినీటి కొరతలేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సంగీత, పంచాయతీరాజ్ డిఈ సురేష్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, ప్రభాకర్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరూర్‌లో జిమ్ సెంటర్ ఏర్పాటు

జిమ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న మెలిగిరిపేట సర్పంచి షాబుద్దీన్

సదాశివపేట, మార్చి 18, ప్రభాతవార్త:
సదాశివపేట మండలంలోని మిలగిరిపేట్ సర్పంచి షాబుద్దీన్ ఆరూరులో జిమ్ ఓపెనింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. ఈసందర్భంగా మెలిగిరిపేట గ్రామ సర్పంచి షాబుద్దీన్ మాట్లాడుతూ యువత ఫిట్నెస్‌లో ఉండాలంటే జిమ్ తప్పనిసరిగా చేయాలన్నారు. జిమ్ చేయడం ద్వారా శరీరంలోని భాగాలన్నీ ఫిట్టుగా ఏర్పడతాయన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రేణుకచిరు, సర్పంచులఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు మధు, లావణ్య, ముగ్ధం పటేల్, అనితశ్రీనివాస్, కొంశట్‌పల్లి రఫీ, శివానంద్‌గౌడ్, మల్లేశం మిలిగిరిపేట్, ఆరూరు గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు నీటిని విడుదల చేయాలి

-రైతుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, మార్చి 18, ప్రభాతవార్త:
నర్సాపూర్ నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే సునీతారెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఘనాపూర్ ఆయకట్టు పరిధిలో ఉన్న పంటలు ప్రస్తుతం చివరిదశలో ఉండగా నీటికొరత కారణంగా పంటలు ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయని అన్నారు. దీంతో రైతులు పంటలను కాపాడుకోవాలని నీటికోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ మేరకు సింగూర్‌ప్రాజెక్టునుంచి ఘనాపూర్ ఆనకట్టకు సుమారు 0.3 టిఎంసిల నీటిని విడుదల చేస్తే ఈప్రాంతంలోని లక్ష ఎకరాల్లో ఉన్న పంటలను కాపాడవచ్చు అని తెలిపారు. ఈసందర్భంగా ఇరిగేషన్ మంత్రి ఎన్.ఉత్తం కుమార్‌రెడ్డి తక్షణమే స్పందించి రైతుల పంటపొలాలను రక్షించేందుకు అవసరమైన నీటిని విడుదలచేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి విజ్ఞప్తిచేశారు. అదే విధంగా వెల్దుర్తి నుంచి మెదక్ వరకు పిల్లికొట్టాల మార్గంద్వారా వెళ్లే రహదారి పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు. నర్సాపూర్ నుంచి మెదక్ వరకు ఉన్న రహదారిని ఫోర్‌లైన్ రోడ్డుగా విస్తరించేందుకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

-నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్

నారాయణఖేడ్, మార్చి 18, ప్రభాతవార్త:
జిల్లాలో ఎండతీవ్రత క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని నారాయణఖేడ్ వైద్యాధికారి డాక్టర్ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీవ్రమైన వేడిగాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలని సూచించారు. చల్లనీటిలో ముంచిన గుడ్డతో తుడవాలని పేర్కొన్నారు. ఎండదెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్లూకోజు, పప్పుకట్టు, ఒఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలని వివరించారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం, ఆడటం వంటివి చేయవద్దని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళ్తే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలని చూచించారు.

మత్తు పదార్థాల బారిన పడొద్దు

-ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 అధికారి ఎ.శ్రీనివాస్

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వాలంటీర్లు

నర్సాపూర్, మార్చి 18, ప్రభాతవార్త:
యువత మత్తు పదార్థాల బారిన పడకుండా దూరంగా ఉండాలని మత్తు పదార్థరహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 అధికారి ఎ.శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సాపూర్ ఎన్ఎస్ఎస్ యూనిట్2 ఆధ్వర్యంలో శీతాకాల ప్రత్యేకశిబిరంలో భాగంగా దత్తతగ్రామం హన్మంతపూర్‌లో 6వరోజు మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామస్థులకు మత్తుపదార్థాల హానికర పరిణామాలపై వివరంగా తెలియజేశారు. డ్రగ్స్ మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు, బ్యానర్లతో కూడిన ఈ ర్యాలీ గ్రామమంతా ప్రదక్షిణచేసి ప్రజల్లో గణనీయమైన అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్2 విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

-మండల వ్యవసాయ అధికారిణి దీపిక

నర్సాపూర్, మార్చి 18, ప్రభాతవార్త:
రైతుభరోసాకు కొత్త పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయం మండల అధికారిణి దీపిక అన్నారు. ఈ సందర్భంగా ఆమె వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొత్త పాస్ బుక్ పొందిన రైతులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా కోసం పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్సులను జతపరిచి వ్యవసాయ శాఖ గ్రామ విస్తరణ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇందుకోసం చివరి తేదీ ఈనెల 25 అని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.

పరీక్షాకేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్

పదవతరగతి పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

వెల్దుర్తి, మార్చి 18, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన వెల్దుర్తిలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని బుధవారం స్థానిక తహసీల్దారు శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షలురాస్తున్న విద్యార్థుల స్థితిగతులను తెలుసుకున్నారు. మొత్తం విద్యార్థినీవిద్యార్థులు 249మంది పరీక్షలు రాస్తున్నట్లు పాఠశాల డిపార్ట్మెంట్ల అధికారి రామగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి విజ్ఞప్తి

స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న దృశ్యం

రామాయంపేట, మార్చి 18, ప్రభాతవార్త:
రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం జడ్‌పిహెచ్ఎస్‌కు చెందిన కబడ్డీ అండర్17 క్రీడాకారిణులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న నేపథ్యంలో వారికి జాతీయస్థాయిలో ఆడేందుకు అవసరమైన ప్రోత్సాహం కల్పించాలని మహిళాసహకార అభివృద్ధిసంస్థ చైర్మన్ బండ్రు శోభ రాణి కోరారు. బుధవారం స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ చైర్మన్‌ను ఆమె ఆధ్వర్యంలో గ్రామస్థులు కలసి ఈ విషయాన్ని వినిపించారు. ప్రగతి ధర్మారం పాఠశాలకు చెందిన క్రీడాకారిణులు సిహెచ్.రాఘవి, జి.పవిత్ర రాష్ట్రస్థాయిలో ఆడుతున్నందున, వారికి అవసరమైన శిక్షణ, సదుపాయాలు కల్పించి జాతీయస్థాయికి ఎదగడానికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. అదేవిధంగా గ్రామయువత క్రీడల్లో రాణించేందుకు మినీఇండోర్‌స్టేడియం, ఓపెన్ జిమ్, బాస్కెట్‌బాల్ కోర్ట్, కబడ్డీ కోర్టుల నిర్మాణం చేపట్టాలని కోరారు. క్రీడాసదుపాయాలు మెరుగుపడితే గ్రామీణయువతకు మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజు పంతులు, పిఈటి కిరణ్, సివిల్ ఇంజనీర్ దొమ్మాట రవీందర్, ఉప సర్పంచి లలితరమేష్, వార్డ్‌మెంబర్ కట్ట మల్లేశం, సీనియర్ నాయకులు చాకలి చిన్న నారాయణ, ఉడుత రాజేశం, మండల్ యూత్ అధ్యక్షుడు పెటేరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్గెలిలో సిసి రోడ్డు పనులకు సర్పంచి శ్రీకారం

సిసిరోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న సర్పంచి విమల

జహీరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:
మండల పరిధిలోని ఉగ్గెల్లి గ్రామంలో 15లక్షల రూపాయలతో చేపట్టే సిసిరోడ్డు నిర్మాణం పనులకు గ్రామ సర్పంచి పట్లోళ్ల విమలశ్రీనివాస్‌రెడ్డి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి రోడ్డునిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా సర్పంచి విమలశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మౌలికవసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందన్నారు. గ్రామంలో రాకపోకలకై సిసి రోడ్ల నిర్మాణం అవసరమని గుర్తుచేశారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుక్కాపూర్‌లో అభివృద్ధి పనుల జోరు

కొల్చారం, మార్చి 18, ప్రభాతవార్త:
కొల్చారంమండలంలోని తుక్కాపూర్‌గ్రామంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. సర్పంచి దొడ్లె ఆంజనేయులు ఆధ్వర్యంలో 99రోజుల కార్యాచరణలోభాగంగా గ్రామవీధుల్లో సిసిరోడ్ల శుభ్రత, పారిశుధ్యపనులు ముమ్మరంగా చేపడుతున్నారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి ప్రశాంత్, ఉపసర్పంచి ఆరె రవీందర్, వార్డు సభ్యులు సుధాకర్, నవీన్, సిద్ధప్ప, డి.శ్రీశైలం, శ్రీనివాస్, యాదగిరి, బి.నవీన్, సురేష్, మధు, దానయ్య, లక్ష్మయ్య, మల్లేశం పాల్గొన్నారు.

కల్వర్టును పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

పెండింగ్ కల్వర్ట్ పనులు వెంటనే పూర్తి చేయాలి

హుస్నాబాద్ రూరల్, మార్చి 18, ప్రభాతవార్త : పట్టణంలోని ఎల్లమ్మ రోడ్‌లో నిర్మాణంలో ఉన్న కల్వర్ట్ పనులను బుధవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పరిశీలించారు. పదిహేను రోజుల క్రితం తవ్వకం ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు పనులు పూర్తిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వర్ట్‌లో మురికి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వ్యాపించి పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, హుస్నాబాద్ నుండి గౌరవెల్లి, రామవరం వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండు వార్డులకు చెందిన ప్రజలు నిత్యం ఈ రహదారిని వినియోగిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకువచ్చి పనులు వేగవంతం చేయాల్సిన బాధ్యత అధికారులదేనని, పట్టణంలో ఎక్కడ పనులు ప్రారంభించినా రోజులు గడిచినా పెండింగ్‌లో ఉంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న కల్వర్ట్ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, కందుకూరు సతీష్ పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ కంటే రాజుకు ఉగాది పురస్కారం

పురస్కారం అందుకుంటున్న కంటే రాజు దృశ్యం

హుస్నాబాద్ రూరల్, మార్చి 18, ప్రభాతవార్త : పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ కంటే రాజుకు వెన్నెల సాహితీ సంఘం వారు ప్రతిష్టాత్మకమైన అందెశ్రీ ఉగాది పురస్కారంను అందజేశారు. 20 సంవత్సరాలుగా పాఠశాలల్లో చదువుతున్న అమ్మాయిలకు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ అందిస్తూ సేవలు చేస్తున్నందుకుగాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మాయిలకు కరాటే శిక్షణ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ప్రత్యేకంగా పాటను రచించి ఆలపించడం ఈ అవార్డుకు ఎంపిక కావడానికి కారణమైందని కంటే రాజు వెల్లడించారు. భవిష్యత్తులోనూ అమ్మాయిల భద్రత, ఆత్మరక్షణ కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని ఈ సందర్భంగా రాజు తెలిపారు.

ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

ఎల్లమ్మ చెరువు పనులను పరిశీలిస్తున్న దృశ్యం

హుస్నాబాద్ టౌన్, మార్చి 18, ప్రభాతవార్త : పట్టణంలోని ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఈఈ తిరుపతి, డీఈ మహేష్, ఏఈ పృథ్విరాజ్ చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువు అభివృద్ధి ద్వారా పట్టణానికి అందం పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : రాజేశ్వర్‌రెడ్డి

నంగునూర్, మార్చి 18, ప్రభాతవార్త : అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంగునూర్ మండల పరిధిలోని గట్లమల్యాల, సంతోష్‌నగర్ తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి అకాల వర్షంతో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించారు.ఆయా గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో వెయ్యి ఎకరాలకు పైగా పంటలకు నష్టం జరిగిందన్నారు.పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు ధైర్యంగా ఉండాలని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అకాల వర్షం రైతులకు తీరని నష్టం చేసిందన్నారు. వ్యవసాయ అధికారులు తక్షణమే పంటలు నష్టపోయిన గ్రామాలను సందర్శించి రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పంటల నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రైతులకు నష్టపరిహారం అందే వరకు తాను రైతులకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్పంచ్ బానోత్ సరోజన, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రైతులు తదితరులు ఉన్నారు.

రమేష్‌గౌడ్‌కు పరామర్శ

గజ్వేల్ టౌన్, మార్చి 18 (ప్రభాతవార్త): మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేష్‌గౌడ్ నానమ్మ పాల లచ్చుమ్మ ఇటీవల మృతిచెందగా, విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు బుధవారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పాల లచ్చుమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

చిన్నకోడూరు, మార్చి 18, ప్రభాతవార్త :
మండల కేంద్రంలోని ఆసుపత్రిలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టులో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అక్టోబర్ నెల నుంచి ఫిబ్రవరి వరకు వేతనాలు రాలేదని కాంటిజెన్సీ వర్కర్స్ కమల, సత్యలింగంలు తెలిపారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

రూ. 1070 కోట్ల పనులపై సిఎం జవాబుచెప్పాలి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
బిఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసిన రూ.1070 కోట్ల పనుల పునః ప్రారంభానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన తర్వాతే సిఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట జిల్లాలో అడుగు పెట్టాలని బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీనాయకులు కూర మాణిక్యరెడ్డి, జాప శ్రీకాంత్ రెడ్డి, కామిని శ్రీనివాస్, సోమిరెడ్డి, పాపయ్య, రవీందర్‌రెడ్డి, కనకరాజు, కోల రమేష్‌గౌడ్, కామిని ఉమేష్, ఇట్టబోయిన శ్రీనివాస్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22న నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించడానికి సిఎం రావడం సిగ్గుచేటన్నారు.సిద్దిపేట ప్రజలను వంచించే ప్రయత్నంలో భాగంగానే సిఎం వస్తున్నారని ఆరోపించారు. సిఎం జిల్లా పర్యటన స్వాగతిస్తున్నాం కానీ నిలిపివేసిన నిధులపై బదులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని నర్మెటలో రూ.300 కోట్లతో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ తీసుకవచ్చిన ఘనత కెసిఆర్, హరీష్‌రావులదేనని తెలిపారు. 2021లో ఆయిల్ ఫామ్ సాగుకు తొలి మొక్కను నాటించిన ఘనత హరీష్‌రావుదేనని తెలిపారు. జిల్లాలో 14వేల ఎకరాల్లో అయిల్‌ఫాం సాగుచేయడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ హయాంలో 12500 ఎకరాలు సాగు చేస్తే కాంగ్రెస్ అధికారంలోకివచ్చిన తర్వాత కేవలం 200 ఎకరాలల్లో సాగు చేయిందని ఆయిల్‌ఫామ్ సాగుకు కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధిలేదన్నారు. రద్దుచేసిన నిధులు తిరిగి సిద్దిపేటకు ఇవ్వాలన్నారు.

మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బిఆర్ఎస్ పాలనలో సిద్దిపేటకు ఒరగబెట్టిందేమిలేదు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

సిద్దిపేట అర్బన్, మార్చి 18, ప్రభాతవార్త : పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సిద్దిపేటలో అభివృద్ధి పేరిట అంత అవినీతి చేశారే తప్ప ఒరగబెట్టిందేమిలేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) ఆరోపించారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంగునూర్ మండలం నర్మెటలో నిర్మించిన అయిల్ ఫాం ఫ్యాక్టరీ బిఆర్ఎస్ నాయకులు స్వంత డబ్బులతో కట్టలేదని ప్రజాధనంతో నిర్మించారని గుర్తు చేశారు. తామే స్వంత డబ్బులతో నిర్మించినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని బిఆర్ఎస్ నాయకుల తీరుపై మండిపడ్డారు. అధికారంలో ఉన్నంత కాలం బిఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతికి అంతు పొంతు లేదని ఆరోపించారు. అయిల్‌ఫాం ఫ్యాక్టరీని ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకరావాలన్న ఉద్దేశ్యంతో సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభానికి విచ్చేస్తుంటే అది చూసి జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటామని ప్రగల్భాలు పలకడం సరికాదన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు సిఎం రేవంత్‌రెడ్డి వడ్డీలు చెల్లిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న సిఎం రేవంత్ రెడ్డిపై అర్థం, పర్థం లేకుండా ఆరోపణలు, విమర్శలు చేస్తే చూస్తు ఉరుకోమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నారని బిఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యాలు చేయడం మానుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయంజరగాలంటే కాంగ్రెస్ సర్కార్‌తోనే సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గాయజుద్దీన్, హర్షద్, రాజిరెడ్డి, శేఖర్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు తైబజార్, పశువుల సంత వేలం

గజ్వేల్, మార్చి 18 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని తైబజార్, పశువులసంత వేలంను ఈనెల 20వ తేదీ శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు 19వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలలోపు రూ.3 లక్షలను డిడి రూపంలో మున్సిపల్ కార్యాలయం పేరుపై డిపాజిట్ చేయాలన్నారు.

ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 18, ప్రభాతవార్త : సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోని పాఠశాలలో బుధవారం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.సీనియర్ కేజీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అవార్డుల పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో డా" కూన వేణుగోపాలకృష్ణ, . విజయ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ ఈ అరుణ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కీ శెట్టి, డైరెక్టర్ వరలక్ష్మి, పాల్గొన్నారు.

మైనార్టీ యూత్ సెల్ మండల అధ్యక్షుడిగా మోసిన్

కొండాపూర్ మార్చి 18 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ కొండాపూర్ మండలం మైనార్టీ యూత్ సెల్ అధ్యక్షుడిగా మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎండి మోసిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వై.ప్రభు మాట్లాడుతూ టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండలం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ యూత్ సెల్ అధ్యక్షుడిగా మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎండి మోసిన్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. మైనార్టీల హక్కులు, అభివృద్ధికి కృషి చేసే నాయకత్వం అవసరమని, ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తారనే నమ్మకంతో మోసిన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.నూతన అధ్యక్షుడు ఎండి మోసిన్ మాట్లాడుతూ ముస్లిం సహా అన్ని మైనార్టీ వర్గాల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడుతానని, యువతను ఏకతాటిపైకి తీసుకువచ్చి మైనార్టీల అభ్యున్నతికి పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు. సర్పంచ్ అనిల్. ఉప సర్పంచ్ ప్రవీణ్. సొసైటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి. మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌గౌడ్, నరసింహారెడ్డి. పంచాయతీ వార్డు మెంబర్‌లు, గ్రామ అధ్యక్షులు ఆంజనేయులు, మోహన్ పాల్గొన్నారు

నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

జప్తినాచారం సర్పంచ్ పావని శశిదర్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచులు

జాతీయ అవార్డుగ్రహీత సర్పంచ్‌కు సన్మానం

కొండపాక, మార్చి 18, ప్రభాతవార్త : జప్తినాచారం సర్పంచ్ జాతీయ స్థాయి అవార్డును అందుకున్నందుకు కొండపాక మండలం పేరు ప్రతిష్టలు మరింత పెరిగాయని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. బుధవారం జప్తినాచారంలో సర్పంచ్ లక్కిరెడ్డి పావని శశిధర్‌రెడ్డిని మండల సర్పంచుల ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి సర్పంచ్ స్వశక్తి పంచాయతీ నేత్రి అభియాన్ సమ్మేళన్ కార్యక్రమంలో భాగంగా డిల్లీ వేదికగా పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందన్నారు. జప్తినాచారంలో డ్రగ్స్, బహిరంగా మద్యపానం నిషేదంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నందుకు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు యాదవ ఎల్లం, అకారం బాల్‌రాజు, కర్ణాకర్‌రెడ్డి, మల్లయ్య, మిద్దె శివకుమార, సుజాత అశోక్, బాలయ్య, కవిత రవీందర్, నాయకులు రాముల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా...

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి తూం కుంటా నర్సారెడి, డిసిసిబి మాజీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి సర్పంచ్ పావని శశిధర్‌రెడిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారి వెంట గజ్వేల్ ఎఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, సర్పంచులు కొయ్యడ వెంకటేశం, కొల్పుల గంగధర్, కర్ణాకర్, మాజీ పిఎసిఎస్ డైరెకర్ బూర్గుల సురేందర్ రావు, నాయకులు అనంతుల నరేందర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి :ఎసిపి

గజ్వేల్, మార్చి 18 (ప్రభాతవార్త): పోలీస్ శాఖ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఏసిపి నర్సింలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి 16 రకాల రక్త పరీక్షలను వైద్యులు నిర్వహించినట్లు తెలిపారు. గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 45 మంది పోలీస్ సిబ్బందికి రక్త పరీక్షలు నిర్వహించగా ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో రాము, వైద్యులు శ్రీధర్ పర్యవేక్షణలో ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శ్రీనులు పోలీసు సిబ్బంది రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది నిరంతరం ఒత్తిడితో కూడిన విధులలో ఉండడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కాబట్టి తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సిఐ రవికుమార్, ట్రాఫిక్ సిఐ మురళి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, మార్చి 18 (ప్రభాతవార్త): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండలం గిర్మాపూర్ గ్రామంలో సర్పంచ్ చిట్కుల విజయలక్ష్మితోకలిసి మురికికాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలకు సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో రూ. 5.41 కోట్ల నిధులు మంజూరు చేసిందని స్పష్టం చేశారు. పార్టీ లకు అతీతంగా నిధులు, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం జరుగుతుందని, సర్పంచ్‌లు త్వరగా పనులు పూర్తిచేయాలని కోరారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, వంటిమామిడి ఏఎంసి చైర్మన్ విజయమోహన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కీసరి వెంకటేష్, సర్పంచ్‌లు కుమార్‌యాదవ్, చెన్నయ్య, యాదగిరి, మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, చిట్కుల భూంరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాయకులు చిట్కుల గోవర్ధన్‌రెడ్డి, గంగుమల్ల కొండల్‌రెడ్డి, జయరాములుగౌడ్, నర్సా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిర్మాపూర్‌లో మురికికాల్వ నిర్మాణపనులను ప్రారంభిస్తున్న నర్సా రెడ్డి

ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలు

హుస్నాబాద్ టౌన్, మార్చి 18, ప్రభాతవార్త : పట్టణంలోని నవ భారత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు హాజరయ్యారు. వారు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి షడ్రుచుల సమ్మేళనంతో ఉగాది పచ్చడి తయారుచేసి ఉగాది పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరాభవ నామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరాన్ని ఆనందోత్సవాలతో స్వాగతిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కొడకండ్ల ప్రాథమిక పాఠశాలలో...

గజ్వేల్ టౌన్, మార్చి 18 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ముందస్తు ఉగాది సంబరాలను ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉగాది పచ్చడిని తయారుచేసి విద్యార్థులకు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది పండుగ మన జీవితానికి ఒక కొత్త ఆరంభాన్ని సూచిస్తుందన్నారు. ఆయుర్వేద పరంగా ఉగాది పచ్చడి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, కళ్యాణి, సాధన, సాయిప్రియ, రాజమణి, లక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన కిట్‌ల పంపిణీ

అక్కన్నపేట, మార్చి 18, ప్రభాతవార్త : మండల కేంద్రంలో విశ్వకర్మ యోజన పథకం కింద మంజూరైన కిట్‌ను బుధవారం బిజెపి మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామంచ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధిపొందిన అక్కన్నపేటకు చెందిన కందుకూరి అరుణాచారి కిట్‌ను అందజేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం చేతివృత్తుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ఆర్థికంగా బలోపేతం చేసేదిశగా ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారు కందుకూరి అరుణాచారి మాట్లాడుతూ విశ్వకర్మ యోజనలో భాగంగా కిట్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వేణుగోపాల్‌రావు, సంపత్, రవికుమార్, స్వరూప, ఎస్టీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్, సంజీవరెడ్డి, జగదీశ్వర్ చారి, ప్రభాకర్ రెడ్డి, రమేష్, బొంకూరి రజినీకాంత్, మధు, సత్యనారాయణ, రమేష్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి సర్కారు పెద్దపీట : సర్పంచ్

అక్కన్నపేట, మార్చి 18, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన తోఫాలను సర్పంచ్ పాండ్రాల దాము ఆధ్వర్యంలో బుధవారం ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఇఫ్తార్ విందులతో పాటు కొత్త మసీదుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు లతా యాదగిరి, బాలవ్వ కొమురయ్య, దండగుల సురేష్, గ్రామ సెక్రటరీ నిర్మల, నాయకులు ఒగులవేణి రవి, కుంచం కనకయ్య, రాజవీరు పాల్గొన్నారు.

చౌటకుంట తండాలో వీధి దీపాల ఏర్పాటు

అక్కన్నపేట, మార్చి 18 ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం చౌటకుంట తండాలో సర్పంచ్ జాన్‌కుమార్ ఆధ్వర్యంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన సర్పంచుల శిక్షణ తరగతుల్లో భాగంగా, రాబోయే 30 రోజుల్లో చేపట్టే పనుల జాబితాలో వీధి దీపాల ఏర్పాటు చేయాలని ఆయన ప్రణాళికలో పొందుపరిచారు. అందులో భాగంగా బుధవారం తండాలోని ప్రధాన వీధుల్లో, విద్యుత్ స్తంభాలకు దీపాలను అమర్చి గ్రామంలో వెలుగు వాతావరణాన్ని కల్పించారు.

మామిడ్యాల గ్రామంలో...

ములుగు, మార్చి 18 (ప్రభాతవార్త): అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్ అండ్ ఆర్ కాలనీ మామిడ్యాల గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య తెలిపారు. గ్రామంలోని వీధుల్లో రూ.2.50 లక్షల వ్యయంతో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల పోచయ్య మాట్లాడుతూ గ్రామంలో రెండు సంవత్సరాలుగా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ప్రజలు చీకట్లో కాలం వెళ్లదీశారని తెలిపారు. ప్రజలు పార్టీలకతీతంగా సహకరిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు రంగయ్య, స్వామి, గ్రామస్తులు నవీన్, నాగరాజు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కార్పొరేషన్ నిధులను వెంటనే విడుదల చేయాలి

సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు భూక్య కృష్ణ నాయక్

అక్కన్నపేట, మార్చి 18, ప్రభాతవార్త : ఎస్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన లోన్లకు సంబంధించిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని అక్కన్నపేట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు భూక్య కృష్ణ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఎస్టీ కార్పొరేషన్ లోన్లు ఇప్పటివరకు విడుదల కాలేదని, ఎస్టీ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో లోన్ సాంక్షన్ అయినట్లు చూపిస్తున్నప్పటికీ, లోన్ స్టేటస్‌లో బ్యాంక్ ఫార్మాట్ జనరేటర్ అని మాత్రమే కనిపిస్తోందని అన్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆరు నెలలుగా ఈ లోన్లు విడుదల కాకపోవడంతో పాటు కొత్తగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అప్లై చేసుకునే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్టీ కార్పొరేషన్ లోన్లకు సంబంధించిన చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ లోన్లకు సంబంధించి దాదాపు రూ. 250 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా 3,000 నుంచి 4,000 మంది లబ్ధిదారులు ఉన్నారని భూక్య కృష్ణనాయక్ తెలిపారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

బిఆర్ఎస్ నేత బుర్ర శ్రీనివాస్‌గౌడ్

హుస్నాబాద్ రూరల్, మార్చి 18, ప్రభాతవార్త : రెండు రోజులుగా భారీ ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాల వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గపరిధిలోని భీమదేవరపల్లి, సైదాపూర్, హుస్నాబాద్, అక్కన్నపేట తదితర మండలాల్లో మామిడి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చేతికొచ్చిన పంట నేలరాలిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈసారి నియోజకవర్గ వ్యాప్తంగా మామిడి పంట మంచి స్థాయిలో వచ్చిందని, దానిపై రైతులు ఎంతో ఆశలు పెట్టుకున్న సమయంలో అకాల వర్షాలు వారి ఆశలను నీరుగార్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విబిజి రాంజీ పథకం రద్దు చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

రాయపోల్, మార్చి 18 (ప్రభాతవార్త): ఉపాధిహామీ చట్టాన్ని యదావిధిగా కొనసాగిస్తూ విబిజి రాంజీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని, ఐదు వారాలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సిపిఎం నాయకుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాయపోల్ ఎంపిడివో కార్యాలయంలో సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధులను తగ్గిస్తూ పథకాన్ని బలహీనపరుస్తోందని విమర్శించారు. విబిజి రాంజీ పథకం వల్ల పేదలకు ఉపాధి దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాలలో ఫోటో క్యాప్చర్ విధానం అమలు గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య వల్ల కష్టమవుతోందని పేర్కొన్నారు. పాత విధానంలోనే పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీకి రూ.2.5 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజు కూలీని రూ.800గా నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

-రెవెన్యూ అధికారులకు బిజెపి నాయకుల వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

మనోహరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:

బిజెపి రాష్ట్రశాఖ ఆదేశాలమేరకు మనోహరాబాద్ మండల అధ్యక్షులు బక్క వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందచేయడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని, రాష్ట్రంలో అర్హులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని, వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు నూతన పింఛన్లు మంజూరు చేయడం లేదని, ఎన్నికల సమయంలో అనేక ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు పెట్టుబడి సాయం ఎకరాకు రూ.6000 వేస్తామని చెప్పి మూడు విడతల పైసలు ఎగ్గొట్టి రైతులను మోసంచేస్తోందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగింది. కాని వాటిలో ఏ ఒక్కహామీ కూడా ఇప్పటివరకు పూరిగా అమలుకాలేదు. ముఖ్యంగా యువతకు జాబ్ కాలండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, పేదలకు గృహనిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటికీ అమలుకావడంలేదు. ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓటువేసిన ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుభరోసా సమయానికి అందకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఆసరాపెన్షన్లు అర్హులైన లబ్ధిదారులకు అందడంలేదు. మండలంలో దరఖాస్తు చేసుకున్న అనేకమంది వృద్ధులు వికలాంగులు, ఒంటరిమహిళలకు ఇప్పటికీ పెన్షన్లు మంజూరుకాలేదు. అర్హులైన అభ్యర్థులందరి దరఖాస్తులను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని కోరుతున్నాము. పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహనిర్మాణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇల్లు మంజూరు చేయాలని, కాంగ్రెస్‌ప్రభుత్వం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ప్రజలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ వారిసమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, ఆ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, కాళ్లకల్ గ్రామ అధ్యక్షులు కొత్తూరి మల్లేష్‌ముదిరాజ్, మండల నాయకులు ఎర్ర కృష్ణ, బూత్ కమిటీ అధ్యక్షులు చెట్టి రాజు ముదిరాజ్, ఎర్ర శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ మంచి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

ముస్తాభైన వేంకటేశ్వర ఆలయం దృశ్యం

నారాయణఖేడ్, మార్చి 18, ప్రభాతవార్త:

నారాయణఖేడ్ మండలం హనుమంతరావుపేట గ్రామంలో ఈనెల 19వ తేదీ నుండి 24 తేదీ వరకు శ్రీవేంకటేశ్వరస్వామి జాతర కార్యక్రమాలు జరుగుతాయని గ్రామ సర్పంచి అంబాటి తులసిరాజు తెలిపారు. ఈనెల 19న వేంకటేశ్వరస్వామికి అభిషేకం 20న అన్నప్రసాదవితరణ కార్యక్రమం, 21న స్వామివారికి పూజాకార్యక్రమం, 22నకుస్తిపోటీలు, 23న వేంకటేశ్వర స్వామికి అభిషేకాలు, 24న వేంకటేశ్వరస్వామికి పూజాకార్యక్రమాలు, అభిషేకాలు భక్తులు నిర్వహిస్తారని గ్రామసర్పంచి తులసి తెలిపారు. ఉత్సవాలకు లింగనాయక్‌పల్లి, అనంతసాగర్, జూకల్, హనుమంతరావుపేట చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొంటారు. ఉత్సవాలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించాలని గ్రామస్థులకు సర్పంచి అంబాటి తులసిబాయిరాజు, ఉపసర్పంచి చంద్ర శేఖర్, ఆలయకమిటీ చైర్మన్ ఆర్కల అంతయ్య, శ్రీవేంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

పుల్‌కల్ మండలంలో రాళ్ల వాన

-విద్యుత్ సరఫరాకు అంతరాయం

పుల్‌కల్‌లో వడగండ్లు కురిసిన దృశ్యం

పుల్‌కల్, మార్చి 18, ప్రభాతవార్త:

మండలంలోని ఆయాగ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన రాళ్లవాన ఎడతెరిపి లేకుండా రెండుగంటలకు పైగా కురిసింది. భారీగా వడగండ్లు కురుస్తుండటంతో ఆకాశంనుంచి రాళ్లు పడుతున్న శబ్దాలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలగా, చెట్లు విరిగి రహదారులపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలపరిధిలోని సింగూరు, ముద్దాయిపేట, పోచారం, పెద్దారెడ్డిపేట, పుల్‌కల్, ముదిమాణిక్యం తదితరగ్రామాలు వర్షంతో తడిసిముద్దయ్యాయి. భారీగా వర్షంకురియడంతో విద్యుత్‌సరఫరా ఆగిపోవడంతో ఇళ్లలోని ప్రజలు రాత్రికి దోమలతో సహవాసం చేస్తూ కంటిమీద కునుకులేకుండా గడపాల్సి వచ్చింది.

ఎ-పార్క్‌ను పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

-మాజీ కార్పొరేటర్ సిధూ ఆదర్శ్‌రెడ్డి

ఎ పార్క్‌ను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సిందూ ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 18, ప్రభాతవార్త:

భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలోని ఎ పార్క్‌ను డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. కాలనీవాసులు పార్కులో నెలకొన్న సమస్యలను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన సింధూఆదర్శ్‌రెడ్డి సబంధిత అధికారులతో మాట్లాడి పార్క్‌లోనెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా సర్కిల్ అధ్యక్షురాలు రాణియాదవ్, యుబిడి సూపర్‌వైజర్ రాము, కాలనీవాసులు పాల్గొన్నారు.

కోర్పోలులో ఘనంగా స్వయం పరిపాలన

కోర్పోలు పాఠశాలలో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

చౌటకూరు, మార్చి 18, ప్రభాతవార్త:

మండలపరిధిలోని కోర్పోలుగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణతో పాఠశాలకు చేరకుని తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. జిల్లా కలెక్టర్, డిఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి విద్యార్థులకు పాఠాలను నేర్పించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు సునీత, ఝాన్సీ, కౌసల్యదేవి, రమాదేవి, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై బిఆర్ఎస్ ఆందోళన

రైతుల సమస్యలపై ఆందోళనచేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

సదాశివపేట, మార్చి 18, ప్రభాతవార్త:

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని, మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించి కొనుగోలుకేంద్రాలను తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని చేతుల్లో మొక్కజొన్నకంకులు పట్టుకుని, రైతులకు మద్దతుగా నిరసన తెలిపారు. కాంగ్రెస్‌ప్రభుత్వం వెంటనే కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేసి, రైతులకు సరైన మద్దతు ధర చెల్లించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్‌చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీ నిర్వహించారు. శాసనసభ ప్రాంగణంలోకి మొక్కజొన్నకంకులు తీసుకెళ్లేందుకు అనుమతిలేదని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. రైతుల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ నేతలు పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

అధికసాంద్రతలో పత్తిసాగుతో అధిక దిగుబడులు

-తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.అరుణ

కిసాన్‌మేళాను ప్రారంభిస్తున్న శాస్త్రవేత్తలు

జోగిపేట, మార్చి 18, ప్రభాతవార్త:

అధికసాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేయటం వల్ల మేలైన దిగుబడి వస్తుందని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.అరుణ అన్నారు. సంగుపేట రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కిసాన్‌మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగుతో ఎరువులవినిమయం తక్కువగా ఉంటుందని, రెండవపంట విత్తుటకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్త రంజిత, డా.ఆర్.స్వామి, శ్రీనివాసచారి, మహదేవప్ప, ఆర్. రమాదేవి, వ్యవసాయశాఖాధికారులు శ్రీహరి, చైతన్య, ప్రవీణ పాల్గొన్నారు.

మండలంలోని గ్రామాల్లో భారీ వర్షాలు

-నేలబారిన పంటలు-అయోమయంలో అన్నదాతలు

అత్మూర్‌లో భారీవర్షాలకు నేలబారిన గోధుమపంట దృశ్యం

న్యాల్‌కల్, మార్చి 18, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీవర్షంతో పాటు వడగండ్లుపడపటంతో అన్నదాతలు ఆగమాగమయిపోయారు. పెట్టుబడులు పెట్టి పండిస్తున్న గోధుమ, జొన్న, చియాసీడ్స్, శనగ, బూడిద గుమ్మడి కాయ పంటలు చేతికి అందివస్తున్న తరుణం, లీజుకు తీసుకున్న మామిడి చెట్లకు కాసిన మామిడికాయలు రాలిపోవడంతో అన్నదాత పరిస్థితి అయోమయంగా మారింది. అకాలవర్షాలకు ఆర్థికపరిస్థితి ఆగమైపోయిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన ఎస్ఐ

గడిపెద్దాపూర్‌లో పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శంకర్

అల్లాదుర్గం, మార్చి 18, ప్రభాతవార్త:

మండలపరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న 10వతరగతి పరీక్షాకేంద్రాన్ని బుధవారం ఎస్ఐ శంకర్ పరిశీలించారు. పరీక్షాకేంద్రం సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను తాత్కాలికంగామూసివేసేలా చర్యలుతీసుకున్నారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు చర్యలు తీసుకున్నారు. పరీక్షాకేంద్రం పరిసరాల్లో తనసిబ్బందితో బందోబస్తును ఏర్పాటుచేశారు.

శిథిలావస్థకు చేరిన నాగులపల్లి పాఠశాల



కూలిపోయిన నాగులపల్లి ప్రాథమిక పాఠశాల భవనం

సదాశివపేట, మార్చి 18, ప్రభాతవార్త:

సదాశివపేటమండలంలోని నాగులపల్లిగ్రామంలో ప్రాథమికపాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ, అధికారులు పట్టించుకోవడంలేదని నాగులపల్లి సర్పంచి విజయలక్ష్మి శివానందంగౌడ్ ఆరోపించారు. మంగళవారం కురిసిన వర్షానికి పాఠశాల అదనపు తరగతిగదులు పెచ్చులు ఊడడంతోపాటు మూత్రశాలలు కూలిపోయాయని ఆమె పేర్కొన్నారు. ఈవిషయమై ప్రజావాణిలో రెండు మూడు సార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, నూతన అదనపు తరగతిగదులు, మూత్రశాలలు నిర్మాణంలో అధికారులు చొరవ చూపలేదని విజయలక్ష్మి ఆరోపించారు. గ్రామంలో పాఠశాల అదనపు తరగతులు శిథిలావస్థలో ఉండటంవల్ల విద్యార్థులను పాఠశాలకుపంపడానికి తల్లిదండ్రులు వెనుకంజవేస్తున్నారని, వర్షంపడితే చాలు విద్యార్థుల హాజరుశాతం తగ్గుతుందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి నాగులపల్లి గ్రామంలో పాఠశాల అదనపు తరగతిగదులకు వెంటనే నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తిచేశారు.

రామచంద్రాపురం ఈద్గా వద్ద ఇఫ్తార్ విందు

-పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ప్రోటెం చైర్మన్, బిఆర్ఎస్ ఇంచార్జి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రోటెం మాజీ చైర్మన్, ఎమ్మెల్యేల దృశ్యం

రామచంద్రాపురం, మార్చి 18, ప్రభాతవార్త:

రామచంద్రాపురం ఈద్గావద్ద రంజాన్‌మాసాన్ని పురస్కరించుకుని బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథులుగా మాజీ ప్రోటెం స్పీకర్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డిలు హాజరై ఇఫ్తార్ విందును ఆరగించి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం మాజీ జడ్పిటిసి సభ్యులు కొలను బాల్‌రెడ్డి, జిన్నారం వెంకటేష్‌గౌడ్, బిఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్‌యాదవ్, కో-ఆర్డినేటర్ కృష్ణకాంత్, సర్కిల్ సెక్రటరీ భాస్కర్‌ముదిరాజ్, యువజన అధ్యక్షులు నర్సింహా, బిఆర్ఎస్‌నాయకులు, మైనార్టీనాయకులు పృథ్వీరాజ్, జాకీర్, గౌస్, అజీముద్దీన్, కుతుబుద్దీన్, యూనస్, జావిద్, తెల్లపూర్ మాజీ కౌన్సిలర్లు ఉమేష్, బాబ్జి, కంజర్ల శ్రీశైలం, పాటి సత్యనారాయణ, దేవేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి

సిసి రోడ్డు ప్రారంభిస్తున్న దృశ్యం

నార్సింగి, మార్చి 18, ప్రభాతవార్త:

నార్సింగి మండలం శంకాపూర్ గ్రామంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో ఎన్ఆర్ఈజిఎస్‌లో మంజూరు అయిన 5లక్షల విలువ గల సిసి రోడ్ల నిర్మాణం పనులకు ప్రభుత్వ పాఠశాల దగ్గర బుధవారం సర్పంచి పర్స సంతోష్ ఆధ్వర్యంలో భూమిపూజచేసి ప్రారంభించారు. ఎన్ఆర్ఈజిఎస్‌లో భాగంగా నిధులు గ్రామానికి ఇచ్చినందుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకి సర్పంచి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి మహేష్, వార్డుసభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

శ్రీపరాభవనామ సంవత్సర చిత్రం ఆవిష్కరణ

సిర్గాపూర్, మార్చి 18, ప్రభాతవార్త:

శ్రీపరాభవనామ సంవత్సరానికి(ఉగాది) ఘనస్వాగతం పలుకుతూ లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ మామిడి కాయల గుర్తులు, కోకిలరాగాలు, రామచిలుక పలుకులు, చుట్టూ పచ్చటి ప్రకృతిని గీస్తూ తయారుచేసిన లీఫ్ చిత్రాన్ని ఆవిష్కరించి మండల ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియశారు.

లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ గీసిన చిత్రం

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

సదాశివపేట, మార్చి 18, ప్రభాతవార్త:

సదాశివపేటపట్టణంలోని శాంతినికేతన్ విద్యాలయంలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో వచ్చే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని అగ్నిమాపక సిబ్బంది ఈరోజు అగ్నిప్రమాదాల నివారణపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలి పటేల్ అరవిందశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కలిగించడం జరిగింది. కార్యక్రమానికి అగ్నిమాపక అధికారి ఇన్చార్జి నరసింహారెడ్డి, మారుతి, ఇతరసిబ్బంది పాల్గొని వేసవికాలంలో జరిగే అగ్ని ప్రమాదాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరికి అగ్నిప్రమాదాల అంశాలపై అవగాహన ఉండాలని, రాష్ట్ర అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నంచేస్తుంది అని అన్నారు. అందులో భాగంగానే శాంతినికేతన్ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెటల్‌కుంటలో సిసిరోడ్డు పనులకు శ్రీకారం

మెటల్‌కుంటలో సిసిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

న్యాల్‌కల్, మార్చి 18, ప్రభాతవార్త:

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్‌ప్రభుత్వం అభివృద్ధిపనులు చేపడుతోందని జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, మెటల్‌కుంట మాజీ సర్పంచి గుండంగారి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో 20లక్షల రూపాయల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో చేపట్టే సిసిరోడ్డు నిర్మాణానికి గ్రామంలో శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అధ్యక్షులు పట్లోళ్ల విలాస్‌రెడ్డి, గ్రామ సర్పంచి విజయలక్ష్మి, ఉపసర్పంచి కేశమ్మ, వార్డుసభ్యులు, నాయకులు పాండురంగారెడ్డి, మునీరోద్దీన్, ఫెరోజ్‌ఖాన్, మైపాల్, గొల్ల సంగన్న, గుండంగారి చిరంజీవిరెడ్డి, పరమన్‌గారి శ్రీకాంత్, షేక్ మస్తాన్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందినవారు ఆర్థికంగా స్థిరపడాలి

-మాజీ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

శిక్షణపొందిన మహిళలకు ధృవపత్రాలు అందచేస్తున్న నిర్వాహకులు

రామచంద్రాపురం, మార్చి 18, ప్రభాతవార్త:

ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సురక్ష సేవాసంఘం సౌజన్యంతో తోలుబొమ్మలు, దీపపుపేడ తయారీలో శిక్షణపొందిన మహిళలు ఆర్థికంగా స్థిరపడాలని భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి సూచించారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ సింధు ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణపొందిన మహిళలకు సురక్ష సేవాసంఘం తెలంగాణరాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపిశంకర్‌యాదవ్‌తో కలిసి ధృవపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ పాస్టర్ల అధ్యక్షులు ప్రశాంత్, విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నేహలత, సంగారెడ్డి జిల్లా సురక్ష సేవాసంఘం ఇంచార్జి ఆరతి, వైడిసి ఇంచార్జి తులసి, శిక్షణపొందిన మహిళలు పాల్గొన్నారు.

చారిత్రాత్మక వేతనం ఒప్పదం చేస్తాం

-గేట్ మీటింగ్‌లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు

సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

జహీరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:

మహీంద్రా ట్రాక్టర్స్‌లో కనీవినీ ఎరుగనిరీతిలో చారిత్రాత్మక వేతన ఒప్పందం చేస్తామని, కార్మికులకు మెరుగైన సౌకర్యాలు, హక్కుల సాధనకు సిఐటియు కట్టుబడి ఉందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు అన్నారు. ఈ నెల 20న జరిగే కార్మికసంఘం ఎన్నికలను పురస్కరించుకుని బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ పలు యూనియన్ నాయకుల మాయ మాటలకు కార్మికులు మోసపోవద్దని, కార్మికుల హక్కులను కాపాడుతూ వస్తున్న సిఐటియునే బలపర్చాలన్నారు. సిఐటియు కార్మికుల శ్రేయస్సుకు నిరంతం కృషిచేస్తోందని చుక్కా రాములు అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, మాణిక్యం, జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్, ఆయా యూనియన్ల నాయకులు సిహెచ్ నరేష్, రాజిరెడ్డి, నరసయ్య, సందీప్‌రెడ్డి, రాజు, నారాయణ, మహేశ్వర్, గణేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్‌చెరు, మార్చి 18, ప్రభాతవార్త:

అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి కాలనీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన 75కోట్ల రూపాయలకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధంచేయాలని అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఇంద్రేశం, ఇస్నాపూర్, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్లు, అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్, జలమండలి, ఇంజనీరింగ్‌శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ, అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోగల బీరంగూడ, అమీన్‌పూర్, రామచంద్రాపురం, భారతీనగర్, బొల్లారం వార్డుల పరిధిలోగల ప్రతి కాలనీకి పారిశుధ్య సిబ్బందిని కేటాయించి ప్రతిరోజు పర్యవేక్షించాలని కోరారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సైతం తెలుసుకోవాలని సూచించారు. నూతన కాలనీలకు సరిపడా సిబ్బంది లేకపోతే నూతన సిబ్బందిని నియమించాలని సూచించారు. త్వరలో సిఎస్ఆర్ నిధులద్వారా పారిశుధ్య వాహనాలనుసైతం కేటాయించబోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గపరిధిలోని ఐదు మున్సిపాలిటీలకు ప్రభుత్వం ప్రత్యేకంగా 15కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించడం జరిగిందని, అతి త్వరలో ఇందుకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. అమీన్‌పూర్‌సర్కిల్ పరిధిలో మంచినీటి కొరతలేకుండా చూడాలని జలమండలి అధికారులను ఆదేశించారు. సమావేశంలో అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు అజయ్‌రెడ్డి, తిరుపతి, వెంకటకిషన్, వెంకటరామయ్య, దశరథ్, డిఈ వెంకటరమణ, జలమండలి డిజిఎం శివ, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.